### బీజేపీ ఫాసిస్టు పాలనకు

## చరమగీతం పాడాలి

**ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ నరేందర్**

హైదరాబాద్, మే1 (నమస్తే తెలంగాణ): మే డే స్ఫూర్తితో దేశంలో బీజేపీ ఫాసిస్టు పాలనకు చరమగీతం పాడాలని ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులను మతాల వారీగా విభజించి పాలిస్తూ కార్మిక వ్యతిరేక చట్టాలను మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతూ రిజర్వేషన్లను పరోక్షంగా ఎత్తివేస్తున్నదని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు కాపాడుకోవాలన్నా, కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలన్నా చట్టసభల్లో బడుగు బలహీన వర్గాల మెజార్టీ పెరగాలని, ఆ పోరాటంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించినప్పుడే దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని, ప్రజలకు మేలు జరుగుతుందని వెల్లడించారు.

# గాడిదగుడ్డుతో ఊరేగుతున్న రేవంత్

**తెలంగాణకు ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధం • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): ఎన్నికల వేళ సీఎం రేవంత్‌రెడ్డి గాడిదగుడ్డును తలపై పెట్టుకుని ఊరేగుతున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. తమ పాలనలో కాంగ్రెస్ ప్రజలకిచ్చింది ఇదేనని చెప్తున్నట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. వరంగల్‌కు చెందిన కార్పొరేటర్ కల్పన, ఇతర నేతలు బుధవారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసిన సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఆందోళనకరంగా ఉన్నదన్నారు. పంద్రాగస్టుకు రుణమాఫీ అని ఊదరగొడుతున్నారని, మిగతా గ్యారెంటీల సంగతేమిటని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభావం లేదని, అందుకే అమిత్ షా వీడియో మార్ఫింగ్ చేసి రాజ్యాంగాన్ని మారుస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏనే ఇటలీదని, తెలంగాణ ప్రజల సొమ్మును ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో ఢిల్లీకి తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. గాడిద గుడ్డు నెత్తిన పెట్టుకోవడం కాదని, తెలంగాణకు ఇచ్చిన నిధులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# మంత్రి పొన్నం పెద్ద అవినీతిపరుడు: రాణి రుద్రమ

విద్యానగర్ (కరీంనగర్) మే 1: మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతి పరుడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన అవినీతి, ఆరోపణలు, వ్యవహారశైలిని చూసి కాంగ్రెస్ నేతలే అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. బుధవారం ఆమె కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌పై ఘాటు విమర్శలు చేశారు. పొన్నం ఓ ట్రావెల్స్ అధినేత నుంచి రూ.కోటిన్నర విలువైన కారును తీసుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ బూడిద కాంట్రాక్టర్ల నుంచి లంచాలు తీసుకున్న ఘనత కూడా ఆయనదేనని ఆరోపించారు. ఈ స్కామ్‌పై విచారణ జరపాలని కోరారు.














